సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం । 14 । నవంబర్ । 2024



రూ.2 లక్షల విరాళం


తాళ్లరేవు: సుంకరపాలెంలో పునర్నిర్మిస్తున్న ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామివారి ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటుకు కర్నీటి ఓంకార్ (జార్జీపేట) రూ.2 లక్షల విరాళం అందజేశారు.



600 సెల్‌ఫోన్ల రికవరీ

కాకినాడ క్రైం: దొంగతనానికి గురైన 600 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్టు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. వీటి విలువ రూ.78 లక్షలు అన్నారు.

35 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 35,615 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.70 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 4,100 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

అంకెల గారడీ బడ్జెట్

మాజీ ఎంపీ చింతా అనురాధ



అల్లవరం: ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024–25 బడ్జెట్ అంకెల గారడీ, మోసాల మాయగా ఉందని అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ విమర్శించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పేరుకే ఇది పూర్తి స్థాయి బడ్జెట్ అని, చివరి నాలుగు నెలల కాలానికి మాత్రమే వర్తిస్తుంది కాబట్టి ప్రభుత్వం గొప్పగా కేటాయింపులను చెప్పుకున్నా ఆచరణలో అమలు సాధ్యం కానివని, బాబు ఉట్టి మాటలకు ఇది మరో నిదర్శనం అని ఆమె పేర్కొన్నారు. సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల హామీలతో ఊదరకొట్టిన కూటమి ప్రభుత్వం ఏ ఒక్క పథకానికి న్యాయం చేయలేదని, ప్రజలను మరోసారి మోసం చేసిందని అనురాధ విమర్శించారు. రైతుల పెట్టుబడి సాయం హామీపై కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలిపి ఇస్తామని బాబు మాట మార్చారని, మహాశక్తి పేరుతో 19–59 ఏళ్ల మహిళలకు ప్రతి నెల రూ.1,500 ఇస్తామన్న హామీని తుంగలో తొక్కారని, తల్లికి వందనం'లో కోతలు పెట్టడమే కాకుండా, బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఊసెత్త లేదని, ఉచిత బస్సు ప్రస్తావనే లేదని, 20 లక్షల ఉద్యోగాలు ఎక్కడ నుంచి ఇస్తారని ప్రజలు మండిపడుతున్నట్లు అనురాధ దుయ్యబట్టారు.

రాష్ట్ర స్థాయి పద్య గాన పోటీలకు ఆహ్వానం

అమలాపురం టౌన్: ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో 6 నుంచి 20 ఏళ్ల వయసు ఉన్న వారికి రాష్ట్రస్థాయి పద్య గాన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సమన్వయకర్త డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి తెలిపారు. ఈ పోటీలు ప్రహ్లాద విభాగంలో ఆరు నుంచి పదేళ్ల వయసు గల వారు, మార్కండేయ విభాగంలో 11–15 ఏళ్ల వయసు వారు, వివేకానంద విభాగంగా 16–20 ఏళ్ల వయసు వారు మూడు విభాగాలుగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఒక పద్యాన్ని రాగ యుక్తంగా పాడిన వీడియోతో పాటు పేరు, వయసు, తరగతి, ఊరు, ఫోన్ నెంబర్ చెప్పి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరికి 92472 72066 నెంబరుకు వాట్సప్ చేయాలన్నారు. ప్రాథమిక పరిశీలనలో ఒక్కొక్క విభాగంలో ఎంపికైన 30 మంది చొప్పున 90 మంది పేర్లను ఈ నెల 30వ తేదీన వెల్లడిస్తామన్నారు. వారు డిసెంబర్ 9న గుంటూరులో నిర్వహించే కార్యక్రమంలో ఒక్కొక్కరు మూడు పద్యాలను విధిగా గానం చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం నగదు బహుమతులు ఇస్తామని కొల్లూరి వివరించారు.

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు హసన్



రామచంద్రపురం: ఈ నెల 19 నుంచి పంజాబ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు పట్టణం నుంచి షేక్ హసన్ ఎంపికయ్యాడు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచి తూర్పుగోదావరి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు అతడు చదువుతున్న మోడరన్ జూనియర్ కళాశాల అధినేత జీవీ రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

లోకల్ మాటున లూటీ

- ఖరారు కాని టెండర్లతో అక్రమార్కులకు జాక్‌పాట్
- జిల్లాలో తెరుచుకోని ర్యాంపులు
- స్థానిక అవసరాల పేరుతో అనుమతి
- ఇదే అదనుగా అనధికార తవ్వకాలు



పి.గన్నవరంలో పడవల మీద ఇసుక తరలింపు

సాక్షి, అమలాపురం: ఇసుక ర్యాంపులు తెరిచే విషయంలో జిల్లా యంత్రాంగం తీసుకున్న నిర్ణయంతో అక్రమార్కులకు జాక్‌పాట్ తగిలినట్టైంది. ర్యాంపుల టెండర్లు ఖరారు చేసే ముందు పాటదారుల సాంకేతిక అర్హతలను మరింతగా పరిశీలించాలని నిర్ణయించిన క్రమంలో జిల్లా ఇసుక కమిటీ టెండర్ల ప్రక్రియ జాప్యమవుతోంది. ఈ నేపథ్యంలో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

టెండర్లు ఖరారయ్యే లోపు గోదావరి పొడవునా అనధికార ర్యాంపులు ఏర్పాటు చేసి ఇసుకను తరలించుకుపోతున్నారు. స్థానికంగా నియోజకవర్గ నేతతో మాట్లాడుకోవడం, ర్యాంపుల ఏర్పాటు చకచకా జరిగిపోతున్నాయి. ఇప్పటికే గౌతమీ, వృద్ధ గౌతమీ, వైనతేయ, వశిష్ఠ నదీపాయల పొడవునా ఇష్టానుసారం అనధికార ర్యాంపులు ఏర్పాటు చేశారు. కొత్తపేట, ఆత్రేయపురం, కె.గంగవరం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, అయినవిల్లి, మామిడికుదురు, పి.గన్నవరంలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. తాజాగా బుధవారం జిల్లాలో కొత్తగా ఒకటి రెండు చోట్ల తవ్వకాలు మొదలయ్యాయి. అనుమతులు లేకుండా తవ్వకాలు ఏమిటని రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తుంటే స్థానిక అవసరాల కోసమని చెబుతున్నారు. చివరకు కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) పరిధిలోను, అక్విడెక్టులు, వంతెనల సమీపంలో తవ్వకాలు నిర్వహిస్తున్నారు.

కలిసి వచ్చిన వాయిదా

ఇసుక తవ్వకాలకు సంబంధించి జిల్లాలో 12 ర్యాంపులను గుర్తించారు. ఈ ర్యాంపులలో ఇసుక తవ్వకాలను కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు జిల్లా సాండ్ కమిటీ ఈ నెల ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు టెండర్లను ఆహ్వానించింది. మొత్తం 12 కంపెనీలు టెండర్లు వేశాయి. వాటి అర్హత, నియమ నిబంధనలకు అనుగుణంగా ఉన్నదీ లేనిదీ కమిటీ గుర్తించాల్సి ఉంది. ఐదు న్యాయ పరమైన అంశాలతో పాటు ధ్రువీకరణ పత్రాలు, టర్నోవర్, కంపెనీల ప్రామాణికతను పరిశీలించాల్సి ఉంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం టెండర్లను 12వ తేదీన ఖరారు చేసి అర్హతలున్న కాంట్రాక్టర్లకు ర్యాంపులను అప్పగించాల్సి ఉంది. కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశమైన జిల్లా సాండ్ కమిటీ టెండర్లు తెరిచే ప్రక్రియను వాయిదా వేసింది. కలెక్టర్ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో టెండర్లు ఖరారు చేయకుండానే సాంకేతిక కారణాలను పరిశీలించాల్సి ఉందని వాయిదా వేశారు. మరో మూడు, నాలుగు రోజులు తరువాత కాని టెండర్లు ఖారారయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

తాజాగా మందపల్లి వద్ద దోపిడీ

అధికార పార్టీ అండదండలతో జిల్లాలో అనధికార ర్యాంపులు ఏర్పాటు చేసి ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. స్థానిక వినియోగదారుల అవసరాల దృష్ట్యా అధికారులు అనుమతులు ఇచ్చారని గడుసుగా సమాధానమిస్తున్నారు. గౌతమీ గోదావరికి కుడి వైపున కొత్తపేట మండల పరిధిలోని మందపల్లి ర్యాంపు ఉండగా, దానికి సమాంతరంగా ఎడమ వైపున కపిలేశ్వరపురం మండలం తాతపూడి ఇసుక ర్యాంపు ఉంది. తాతపూడి ర్యాంపు ద్వారా స్థానిక వినియోగదారుల అవసరాల పేరుతో ఇసుక తవ్వకాలకు అధికారులు అనుమతి ఇచ్చారు. కాని అక్రమార్కులు మాత్రం ఇదే అదనుగా మందపల్లి ర్యాంపులో కూడా ఇసుక తవ్వకాలు జరుపుతూ యథేచ్ఛగా రవాణా చేసేస్తున్నారు. స్థానికంగా టీడీపీ ముఖ్యనేత ప్రోద్బలంతో ఇక్కడ తవ్వకాలు జరుగున్నాయి.



కొత్తపేట మండలం మందపల్లి వద్ద మొదలైన ఇసుక తవ్వకాలు

అక్విడెక్టు సమీపంలోనే..

పి.గన్నవరంలో అనధికార ర్యాంపు ఏర్పాటు చేసి ఇసుక తవ్వకాలు చేయడం అటుంచి, సీఆర్‌జెడ్ పరిధిలోనే తవ్వకాలు చేసేస్తున్నారు. దీనిపై మీడియాలో కథనాలు వస్తున్నా అక్రమార్కులు వెనక్కు తగ్గడం లేదు. పైగా పి.గన్నవరం పాత, కొత్త అక్విడెక్టుకు వంద మీటర్ల సమీపంలో తవ్వకాలు చేస్తున్నారంటే వారు ఎంత బరి తెగించారో అర్థం చేసుకోవచ్చు. స్థానికంగా నియోజకవర్గ కీలక నేత వత్తాసుతో తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ తవ్వకాల వల్ల కట్టడాల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే పాత అక్విడెక్టు దెబ్బతింది. అక్విడెక్టుకు కనీసం ఐదు వందల మీటర్ల దూరంలో తవ్వకాలు చేయాల్సి ఉంది. సమీపంలోనే ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ కార్యాలయం ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో రెవెన్యూ అధికారులు స్పందించి బుధవారం మధ్యాహ్నం నుంచి అడ్డుకున్నారు. అయితే తరువాత తవ్వకాలకు అక్రమార్కులు సిద్ధమయ్యారు. ఎల్.గన్నవరం వైపు కూడా తవ్వకాలకు సిద్ధమవుతున్నారు.



పి.గన్నవరం అక్విడెక్టు సమీపంలో ఇసుక తవ్వకాలు

అక్రమార్కులకు పండగ

ఇసుక ర్యాంపుల టెండర్ల ప్రక్రియ వాయిదా పడడం అక్రమార్కులకు వరంగా మారింది. ఇప్పటికే గోదావరిని గుల్ల చేస్తున్న అక్రమార్కులకు మరో మూడు, నాలుగు రోజులు ఇష్టానుసారం తవ్వుకునే అవకాశం దక్కింది. ఇలా వాయిదా పడిందని తెలియడంతో కొత్తగా అనధికార ర్యాంపుల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగానే కొత్తగా కొత్తపేట సమీపంలోని మందపల్లిలో ఇసుక తవ్వకాలు మొదలు పెట్టారు. జిల్లాలో రోజుకు 2,500 ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా తరలిపోతోందని అంచనా. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.కోటి వరకు ఉంటుంది. తవ్వకాలు చేసిన ఇసుకను సొంతంగా ఏర్పాటు చేసుకున్న స్టాక్ పాయింట్లకు తరలించి అక్కడి నుంచి లారీల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. గత ఆగస్టు నుంచి ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఇప్పుడు డిమాండ్ అధికంగా ఉంది. ఐదు యూనిట్ల లారీ ఇసుకను స్థానికంగా రూ.20 వేలు చేసి విక్రయిస్తున్నారు. దీనికి రవాణా చార్జీలు అదనం. ఇసుక కొరత వల్ల పెరిగిన డిమాండ్, ర్యాంపుల ఖరారు వాయిదా పండడం జిల్లాలో అక్రమార్కులు నక్కతోక తొక్కినట్టయ్యింది.

ఎమ్మెల్సీ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం కోరుతూ సమావేశం



శాసన మండలి ఎన్నికలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

సాక్షి, అమలాపురం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రంగా సిద్ధంగా ఉందని, ఇందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమవంతు సహకారం అందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని బుధవారం జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈ ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఈ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు 18వ తేదీ తుది గడువని, 19న పరిశీలన, 21వ తేదీ ఉపసంహరణలకు తుది గడువని తెలిపారు. డిసెంబర్ 5వ తేదీన పోలింగ్, 9న ఓట్ల లెక్కింపు, 12వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఈ ఎన్నికలకు మండలానికి ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3,209 మంది ఓటర్లు ఉన్నారని, పోలింగ్ కేంద్రాల నిర్వహణలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే చెప్పవచ్చని కలెక్టర్ తెలిపారు.

వసతి గృహ విద్యార్థులకు ఆరోగ్య బీమా

జిల్లాలో ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు, అనాథ ఆశ్రమాల్లోని విద్యార్థులకు ఆరోగ్య బీమా కల్పనకు ఐసీఐసీఐ లాంబార్డు హెల్త్ ఇన్సూరెన్స్‌తో ఒప్పందం కుదిరిందని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. జిల్లాలో ఉన్న సుమారు 7,650 మంది విద్యార్థినీ విద్యార్థులు ఇది మేలు చేస్తోందని తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, చిన్నారుల వైద్య నిపుణులతో సమావేశం నిర్వహించి బీమా విధి విధానాలను వివరించారు. నెట్వర్క్ ఆస్పత్రులకు చేసిన మ్యాపింగ్ ఆధారంగా ఆయా ఆసుపత్రులకు చేరుకుని రూ.లక్ష వరకు వైద్య సేవలను పొందవచ్చని వివరించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఎం.ఝాన్సీరాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని పి.జ్యోతిలక్ష్మి దేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా దేవదేవుని జల విహారం

అత్రేయపురం/సఖినేటిపల్లి: క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరుని ఆలయం, సఖినేటిపల్లి మండలం అంతర్వేది లక్ష్మీ నృసింహునికి తెప్పోత్సవాలు నిర్వహించారు. వాడపల్లిలో సుప్రభాత సేవ అనంతరం స్వామి వారిని తీర్థ బిందెతో తీసుకువచ్చిన గోదావరి జలాలతో అభిషేకించారు. గోత్ర నామాలతో పూజలు, నిత్య హోమాలు చేయించి మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ గౌతమీ గోదావరికి తీసుకువెళ్లి తెప్పోత్సవం నిర్వహించారు. దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే అంతర్వేది లక్ష్మీ నృసింహుని తెప్పోత్సవం బుధవారం కన్నుల పండగా నిర్వహించారు. పల్లిపాలెం అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో వశిష్ఠ గోదావరి నదిలో గరుడ పుష్పక వాహనంపై అమ్మవార్లను అయ్యవారిని ప్రతిష్ఠించి తెప్పోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఆలయం నుంచి పల్లిపాలెం పుష్కరరేవు వరకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి వేదమంత్రాలు, బాణసంచా కాల్పులతో నడుమ గోదావరిలో విహరింపజేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఆలయానికి చేర్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రాజోలు సీఐ టీవీ నరేష్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

అలాగే ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయం, ఆత్రేయపురం లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



వాడపల్లిలో దేవేరులతో శ్రీనివాసుడి తెప్పోత్సవం



అంతర్వేదిలో పల్లిపాలెం వద్ద వశిష్ట గోదావరిలో తెప్పపై విహరిస్తున్న లక్ష్మీ నృసింహుడు

చెత్త డంపింగ్‌లో ఉద్రిక్తత



ఆందోళకారులను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

- ట్రాక్టర్లను అడ్డుకున్న బండారులంక గ్రామస్తులు
- రోగాలు వస్తున్నాయని ఆందోళన
- 40 మందిని అరెస్టు చేసిన పోలీసులు

అమలాపురం రూరల్: మండలం బండారులంకలోని డంప్ యార్డులో చెత్త వేసేందుకు వచ్చిన ట్రాక్టర్లను స్థానికులు అడ్డుకోవడం ఉద్రిక్తతలకు దారితీసింది. బుధవారం చెత్త వేసేందుకు వచ్చిన ట్రాక్టర్లను స్థానిక మహిళలు అడ్డుకుని తమ పైనుంచి వెళ్లాలని రోడ్డుపై బైఠాయించారు. వీరభద్రస్వామి గుడి వద్ద పంచాయతీ డంప్‌యార్డు వల్ల రోగాలు వస్తున్నాయని గత 40 రోజులుగా వారు ఈ విషయమై ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో గ్రామంలో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి ప్రజలు డెంగీ, చికున్ గున్యాలతో బాధపడుతున్నారు. దీంతో ప్రత్యామ్నాయం దొరికే వరకు ఆర్డీఓ కె.మాధవి ఆదేశాల మేరకు డంప్ యార్డుకే చెత్తను తరలించారని నిర్ణయించారు. డీఎల్‌పీఓ కె.బొజ్జిరాజు, తహసీల్దార్ కిశోర్ బాబు, డీటీ పలివెల అశోక్, ఈఓపీఆర్డీ కె.మంగాదేవి, కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు సర్కిల్‌లో ఎస్సైలు శేఖర్‌బాబు, హరీష్‌కుమార్, రాజేష్‌తో పాటు 50 మంది పోలీసులు గ్రామంలో మోహరించి బందోబస్తీ మధ్య చెత్తను టాక్టర్లతో తరలించారు. దీంతో స్థానికులు ఆందోళన చేపట్టడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్‌తో పాటు 40 మందిని పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

సహకారం.. ప్రగతి పథం

- స్ఫూర్తిని చాటుకుంటున్న సంఘాలు
- నేటి నుంచి సహకార వారోత్సవాలు
- షెడ్యూల్ ప్రకారం నిర్వహణకు ఏర్పాట్లు



సహకార వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ తదితరులు

అమలాపురం టౌన్: ఒక్కరి కోసం అందరం.. అందరి కోసం ఒక్కరు.. అనే నినాదంతో వందల ఏళ్ల కిందటే మనిషి సహకారం బాట పట్టాడు. సంఘటితంగా ఉండడం, సహకరించుకోవడం ద్వారా ఎంత బలంగా నిలబడవచ్చో గ్రహించాడు. కాలక్రమేణా కావలసింది సాధించుకునేందుకు ఆయా సంఘాలు, సహకారం అనేవి ఓ వ్యవస్థగా రూపొందింది. ఈ స్ఫూర్తితో ఏటా నవంబర్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ జాతీయ సహకార యూనియన్ ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దేశంలో 1904 సంవత్సరంలో సహకార వ్యవస్థకు బీజం పడగా, నేడు 71వ అఖిల భారత సహకార వారోత్సవాల నిర్వహణకు ఆ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాలోని 166 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, 24 డీసీసీబీ శాఖలు, 25 చేనేత సహకార సంఘాల్లో ఈ వారోత్సవాల నిర్వహణకు జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ ఇప్పటికే ఆయా సంఘాల సీఈఓలతో చర్చించారు. సహకార సంఘాల్లో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన వంటి అంశాలను వివరించేందుకు జిల్లా శాఖ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ప్రతి సంఘం ప్రాంగణంలో సహకార పతాకాలు రెపరెపలాడనున్నాయి. అమలాపురం డివిజన్ విభాగం సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు కూడా వారోత్సవాలను డివిజన్‌లో స్ఫూర్తిదాయకంగా నిర్వహించేందుకు సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కేవలం రైతులకు రుణాలు ఇవ్వడం, వసూలు చేయడానికే గతంలో పరిమితమైన సహకార రంగం ఇప్పుడు బ్యాంకింగ్ రంగానికి ఏ మాత్రం తీసిపోకుండా సంఘాలను పూర్తి కంప్యూటీకరిస్తూ సాంకేతిక విప్లవం సాధిస్తోంది. పరపతేతర వ్యాపారాలతో సహకార సంఘాలను బలోపేతం చేస్తోంది. ఎరువుల వ్యాపారాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఆక్వా సాగుకు అవసరమైన సామగ్రి, పరికరాలు, వ్యవసాయ యంత్రాలు ఇలా పలు రకాలుగా రైతులకు సహకార రుణాలతో తన సహకారాన్ని పటిష్టం చేసుకుంటోంది. జిల్లా సహకార వారోత్సవాలకు శ్రీకారం చుడుతూ కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ వారోత్సవాల పోస్టర్లు, బ్రోచర్లను మంగళవారం ఆవిష్కరించారు.

వారోత్సవాల షెడ్యూల్..

- 14వ తేదీ గురువారం సహకార వారోత్సవాలు ప్రారంభం. సహకార మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన నూతన కార్యక్రమాలపై చర్చ. సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడంపై ఇష్టాగోష్టి.
- **15వ తేదీ:** సహకార సంఘాల్లో నూతన ఆవిష్కరణలు, సాంకేతిక, సుపరిపాలనపై సమీక్ష.
- **16వ తేదీ:** వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి పెంపొందించడంపై చర్చ.
- **17వ తేదీ:** సహకార సంస్థల వ్యాపార ప్రయోజిత సంస్థలుగా రూపాంతరంపై సమీక్ష.
- **18వ తేదీ:** సహకార సంఘాల మధ్య సహకారంపై చర్చ.
- **19వ తేదీ:** సహకార వ్యవస్థలో మహిళలు, యువకుల పాత్ర, బలహీన వర్గాలకు చేయూత తదితర అంశాలపై సమీక్ష.
- **20వ తేదీ:** వారోత్సవాల ముగింపు సభలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో మెరుగైన సహకార నిర్మాణంలో సహకార సంఘాల పాత్రపై సమీక్ష.

సహకార స్ఫూర్తిని చాటుదాం



సహకార వారోత్సవాల వేదికలపై సంఘాల సిబ్బంది, సంఘాల సభ్యులుగా సహకార స్ఫూర్తిని చాటుదాం. కలెక్టర్, జిల్లా సహకార అధికారి ఆదేశాలతో ప్రతి సంఘంలో వారోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ వారోత్సవాల ద్వారా వందేళ్ల కిందట మనకు సహకార వ్యవస్థ ఎలా పరిచయం అయింది. ఉద్యమాలతో ఎలాంటి సహకార ఫలాలు అందుకున్నాం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

– ఆదిమూలం వెంకటేశ్వరరావు,
సహకార వారోత్సవాల ఇన్‌చార్జి,
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా